క్లుప్తంగా

ఖాతాల్లోకి పింఛన్ డబ్బులు

వీరఘట్టం: వచ్చే నెల మే 1వ తేదీన పింఛన్ దారుల బ్యాంకు ఖాతాల్లోకి పింఛన్ డబ్బులు పడతాయని ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 10,058 మంది సామాజిక పింఛన్‌దారులు ఉన్నారని, వీరిలో 8042 మందికి బ్యాంకు అకౌంట్‌లు ఉన్నాయని, 2016 మందికి అకౌంట్స్ లేవన్నారు. బ్యాంకు అకౌంట్స్ ఉన్నవారు బ్యాంకు బుక్‌తో పాటు ఆధార్ కార్డును బ్యాంకుకు తీసుకువెళ్లి డబ్బులు తీసుకోవచ్చునన్నారు. బ్యాంకు అకౌంట్ లేని వారికి మే 5వ తేదీలోపు పంచాయతీ కార్యదర్శులు పింఛన్‌దారుల ఇంటికి వచ్చి పింఛన్లు అందజేస్తారని ఆయన తెలిపారు.

పశువులను సంరక్షించుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నందున పాడి రైతులంతా పశువులను సంరక్షించుకోవాలని గుమ్మలక్ష్మీపురం పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పశువులను వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం మాత్రమే మేత కోసం బయటకు తీసుకెళ్లాలని, పాకలు, కొట్టాలు లేని వారు చెట్ల నీడలో పశువులను ఉంచాలని, తగినంత పరిశుభ్రమైన తాగునీరు పశుపాకల వద్ద అందుబాటులో ఉంచాలని సూచించారు. వీలైనంత ఎక్కువగా పచ్చిమేత అందివ్వాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కొండాపురం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దిశ డీఎస్పీ హర్షిత చంద్ర

పాలకొండ: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను దిశ డీఎస్పీ హర్షిత చంద్ర సోమవారం పరిశీలించారు. కొండాపురం, ఎన్‌కెరాజపురం ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూట్‌మ్యాప్ కోసం పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నామని, ఎన్నికల సమయంలో ప్రత్యేక టీం పర్యవేక్షణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ఇప్పటికే ప్రజలకు అవగాహన కలిప్తున్నామని వివరించారు. ఆమెతో పాటు ఎస్‌ఐ ప్రశాంత్ కుమార్ ఉన్నారు.

ఘనంగా గ్రామ దేవత సంబరాలు



బత్తిలిలో అమ్మవారి ఘటాల ఊరేగింపు

భామిని: మండలంలోని బత్తిలి కొత్త కాలనీలో శ్రీముత్యాలమ్మ తల్లి గ్రామ దేవత సంబరాలు ఘనంగా సాగుతున్నాయి. సోమవారం సంబరాల్లో భాగంగా అమ్మవారి పాల జంగిడి, అమ్మవారి ఘటాలను ఊరేగించారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమైన సంబరాలు మే 1వరకు కొనసాగనున్నట్టు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

బీజేపీ ఏం చేసిందని పొత్తు పెట్టుకున్నారు...

పాలకొండ: రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందని ఆ పార్టీతో టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకున్నాయని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ప్రశ్నించారు. పాలకొండలో సీపీఐ మేనిఫెస్టోను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను చేపట్టి, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అలాంటి వారితో పొత్తు సమంజసం కాదన్నారు. ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. సీపీఐ నాయకులు సూరయ్య, లింగరాజు, నాయుడు, గోపినాయుడు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లండి



ఎమ్మెల్యే కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీరవిబాబు

వీరఘట్టం: సాధ్యం కాని హామీలతో టీడీపీ ప్రజలను మరోసారి మోసగించేందుకు సూపర్ 6 అంటూ ప్రచారం చేస్తోందని, అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం అమలు చేయగలిగే హామీలను మాత్రమే ఇస్తున్నారని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. సోమవారం ఆయన వీరఘట్టం మండలంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతితో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను పెంచుతూ కొత్తగా రూపొందించిన వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల ప్రచారం చేపట్టాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు తదితరులున్నారు.

జనం మెచ్చిన నాయకుడు జగనన్న



తెట్టంగిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: జనం మెచ్చిన నేత జగనన్నను మళ్లీ ఆశీర్వదించి, గెలిపిస్తే సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే మళ్లీ వస్తాయని వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని వండువ, బిటివాడ, తెట్టంగి గ్రామాల్లో సోమవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే కళావతికి, ఎమ్మెల్సీ విక్రాంత్‌కు ఘనంగా స్వాగతం పలికి ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు. అబద్ధపు హామీలిస్తూ మిమ్మల్ని మోసగించేందుకు వస్తున్న గ్లాసు పార్టీని నమ్మొద్దని కోరారు. అనంతరం వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోను వివరించారు. రైతుభరోసా పెంపు,అమ్మ ఒడి పెంపు, వైఎస్సార్ పింఛన్ కానుక పెంపు తదితర అనేక సంక్షేమ పథకాలను పెంపు చేయడంతో పాటు మరికొన్ని పథకాలను యథావిధిగా కొనసాగిస్తామని ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరలా రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రావాలని అందుకు ప్రజల ఆశీస్సులు కావాలని ప్రజలను కోరారు. గత ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమం,అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ప్రచారంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, సర్పంచ్‌లు మిడితాన కళ్యాణి, అలజంగి విజయమ్మ, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, కుద్దిగాన వెంకటరమణమూర్తి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, నల్లబిల్లి సుహాసిని, భోగి మణి, శంభాన శ్రీను, సతివాడ చిన్నంనాయుడు, పరిసినాయుడు, నీలం సత్యంనాయుడు, జంపు శేఖర్, రంభ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్నదాతకు ఆర్థిక భరోసా



చెబితే.. చేస్తారు...మాటిస్తే...మడమ తిప్పే ప్రసక్తే లేదు...ఇదీ జగనన్నపై ప్రజలకున్న అపార నమ్మకం. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రకటించిన మేనిఫెస్టోలో రైతు భరోసాను రూ.13,500 నుంచి 16 వేలకు పెంచుతామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో అన్నదాతలో ఆనందం వెల్లివిరుస్తోంది. సాగుకు మరింత చేయూత నివ్వడం హర్షణీయమని రైతులు పేర్కొంటున్నారు. జగన్ పాలనలోనే వ్యవసాయం పండగలా మారిందని హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

అన్నదాతకు అండగా..



రైతు భరోసా పథకం కింద ఏటా పంట పెట్టుబడి సాయం ఏడాదికి రూ.13,500లు చొప్పున ఐదేళ్లు ఇచ్చారు. ఈ సాయాన్ని రూ.16,000 పెంచుతూ నిర్ణయం తీసుకొన్నారు. ఈ నిర్ణయం రైతులకు ఎంతో ఆర్థిక భరోసానిస్తుంది. ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీకి పంట రుణాలు, వ్యవసాయానికి తొమ్మిది గంటల ఉచిత విద్యుత్, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నేరుగా సేవలు నిరంతం కొనసాగుతాయని ప్రకటించారు. రైతులను ఆదుకొనే నాయకున్ని మళ్లీ ఎన్నుకోవాల్సిన అవసరం వుంది.

–పల్ల హేమసుందరరావు, రైతు, శివ్వాం, గరుగుబిల్లి

రైతే రాజని నమ్మిన జగన్



రైతే రాజని జగన్ నమ్మారు. అందుకే రైతులకు అన్నివేళలా అండగా ఉంటున్నారు. రైతు భరోసా ఐదు విడతల్లో అందించారు. ఈ నిధులతో పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేశాను. జగనన్న సరైన సమయానికి భరోసా నిధులు అందిస్తున్నారు. ఈ దఫా ఇంకా పెంచుతున్నారని విని సంతోషపడ్డాం. చెప్పాడంటే ఆయన చేస్తాడు అంతే.

– దాసు షణ్ముఖరావు, రైతు, పాలకొండ

రైతు భరోసా పెంపుతో మేలు



వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాను. గతంలో పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ప్రైవేటు వ్యాపారుల వద్ద వడ్డీలకు పెట్టుబడులు తేవాల్సి వచ్చేది. పంటలవచ్చిన సమయంలో పంటలను ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు ఇవ్వాల్సి వచ్చేది. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించడంతో పాటు పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం వల్ల గిట్టుబాటు అవుతున్నాయి. ఎన్నికల మేనిఫేస్టోలో పెట్టుబడి సాయాన్ని రూ.13,500ల నుంచి రూ.16వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకొన్నారు. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరంగా వుంటుంది.

– మంత్రాపు చిట్టిబాబు, రైతు, పెద్దూరు, గరుగుబిల్లి

రైతు భరోసా పెంపుతో ఆనందం



వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో రైతు భరోసా పెంపుతో రైతుల్లో ఆనందం నెలకొంది. గత మేనిఫెస్టోలో కన్నా ఈ మేనిఫెస్టోలో రైతు భరోసా పెంచడం ఆర్థిక భరోసానిస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– బలగ వెంకటరమణ, రైతు, చినమేరంగి, జియ్యమ్మవలస

రాష్ట్రంలో రైతు ప్రభుత్వం



గతంలో సాగు పెట్టుబడులకు చేతిలో సొమ్ము లేక తీవ్ర ఇబ్బందులు పడేవారం. పాదయాత్రగా వచ్చిన జగనన్న అప్పట్లో రైతులను ఆదుకుంటామని మాట ఇచ్చారు. ఈ మేరకు రైతు భరోసా పేరిట పెట్టుబడి నిధులు అందించారు. ఈ మొత్తాలతో ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా పంటలు పండిస్తున్నాం. మా కష్టం గుర్తించారు. అందుకే తన మేనిఫెస్టోలో రైతుభరోసా నిధులు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఎంతో సంతోషంగా ఉంది. ఇది రైతు ప్రభుత్వం.

– మిడితాన కన్నంనాయుడు, రైతు, భాసూరు, పాలకొండ

పెంపు హర్షణీయం



రైతు భరోసా పెంపు హర్షణీయం.జగనన్న పాలనలో రైతులు సంతోషంగా సాగు చేస్తున్నారు. విత్తనం నుంచి పంటల విక్రయం వరకూ అన్నీ తానై జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చూసుకుంటోంది. దీంతో రైతుల్లో ఆందోళన తొలగింది. ఈ సమయంలో రైతు భరోసా పెంచుతూ నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషం.

– కొండగొర్రి అప్పారావు, రైతు, కుక్కిడి, గుమ్మలక్ష్మీపురం

ఓటర్లకు అసౌకర్యం కలగకుండా చూడాలి : డీఎస్పీ



రావివలస పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

గరుగుబిల్లి: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అసౌకర్యం కలగకుండా చూడాలని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. మండలంలోని రావివలస, మరుపెంట, గొట్టివలస, ఉల్లిభద్ర, సీతారాంపురం, కొంకడివరం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యం, భద్రతపరమైన అంశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట చినమేరంగి సీఐ మంగరాజు, ఎస్‌ఐ వై.అమ్మన్నరావు తదితరులున్నారు.

సంక్షేమం, అభివృద్ధి చూసి ఓటేయండి



జి.శివడ గ్రామ ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుష్పశ్రీవాణికి ఘన స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: గిరిజన గ్రామాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందని, ఐదేళ్లలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి జరిగిందంటేనా తమకు ఓటు వేసి గెలిపించాలని కురుపాం పాముల పుష్పశ్రీవాణి ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని జి శివడ, గుజ్జువాయి, వలసబల్లేరు, గొత్తిలి, ఊసకొండ పంచాయతీల్లో ఉన్న గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనను గత టీడీపీ ప్రభుత్వ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయలు కల్పనకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి నిర్మాణాలు చేపట్టిందన్నారు. ప్రతీ గిరిజన గ్రామానికి రహదారి, తాగునీరు సౌకర్యాలు కల్పించామని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు ద్వారా నేరుగా అర్హులైన ప్రతీ ఒక్కరికి పార్టీలకు అతీతంగా లబ్ధి చేకూరిందని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఓట్లు కోసం టీడీపీ ఇప్పుడు గ్రామాల్లోకి వచ్చి నెరవేర్చలేని హామీలను ఇచ్చి మళ్లీ మోసం చేసేందుకు వస్తుందని వారి మాటలను నమ్మి మోసపోవద్దని కోరారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతీ ఇంటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని కోరారు. ప్రచారంలో గుజ్జువాయి, జి.శివడ సర్పంచ్‌లు నాగేశ్వరరావు, మిన్నారావు, కురుపాం ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, విద్యారాణి, రాజేశ్వరి, మండల కన్వీనర్ గౌరీశంకర్, నీలకంఠాపురం సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు, జిల్లా, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, జిలాని, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనిమి ఇందిరాకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెంకటరావు, గులిపల్లి రాజారావు, ఇంటికుప్పల రామకృష్ణ, రేవు సత్తిబాబు, షేక్ నూరెల్ల తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



అర్బన్ పీహెచ్‌సీలో వైద్యులకు సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

పాలకొండ రూరల్: ప్రస్తుత సీజన్‌లో వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో మరింత మెరుగ్గా తమ సేవలు అందించాలని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి బగాది జగన్నాథరావు అన్నారు. మండలంలో అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీలతో పాటు పట్టణ పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా సోమవారం ఆయన సందర్శించారు. అక్కడ సేవలు పొందుతున్న రోగులతో మాట్లాడి వారి సంతృప్తి స్థాయిపై ఆరా తీశారు. రికార్డులు, మందుల నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉంటున్నందున అన్ని వర్గాల ప్రజలు అనుసరించాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, పిల్లల ఆరోగ్య రక్షణ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఆయన వెంట వైద్యులు వి.కమల్‌నాథ్, తేజ రత్నకుమార్, రవికుమార్ తదితరులున్నారు.

విద్యార్థులకు పునశ్చరణ తరగతులు



తరగతుల్లో నిమగ్నమైన ఇంటర్ విద్యార్థులు

పాలకొండ రూరల్: ఇంటర్ విద్యార్థులకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్టు పాలకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.హరగోపాల్ అన్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చిన వారితో పాటు ఫెయిల్ అయిన విద్యార్థులచే మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు సబ్జెక్టుల వారీగా ఈ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు 60 మంది విద్యార్థులు ఈ శిక్షణా తరగతులకు హాజరవుతున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సోమవారం ఫిజిక్స్ తరగతులు నిర్వహించారు. విద్యార్థుల సందేహాలను అధ్యాపకులు నివృత్తి చేసారు. సబ్జెక్టుల అధ్యాపకులు కామర్స్ పైల శంకరరావు, ఆంగ్లం నారాయణరావు, ఫిజిక్స్ వెంకటరమణ, హిస్టరి శ్రీనివాసరావు, ఒకేషనల్ వెలమల అప్పారావు, బత్తుల రవిశంకర్ తదితరులు విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. వచ్చే నెల 20 వరకూ ఈ తరగతులు కొనసాగుతాయని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్యకు చెక్

పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తన నియోజకవర్గంలో తిరగని ఊరు లేదు. ఆ సమయంలోనే అక్కడ సమస్యలు తెలుసుకొని ఎక్కడికక్కడ పరిష్కరించేవారు. ముఖ్యంగా తాగునీటి సమస్యపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. సీతంపేట ఏజెన్సీలో సుమారు 526 గిరిజన గ్రామాలున్నాయి. ఇక్కడ టీడీపీ హయాంలో నెలకొన్న సమస్యలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పరిష్కారానికి నోచుకున్నాయి. ముఖ్యంగా తాగునీటి విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. తీవ్ర నీటి ఎద్దడితో అల్లాడిన లంగడుగూడ, తాలాడ, వజ్జాయిగూడ, బొండి, బొండిగూడ, నాగులగూడ, రాజన్నగూడ, కంబగూడ, మెట్టుగూడ గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారమైంది. ప్రస్తుతం బోర్‌వెల్స్ 702, సోలార్ 126, సీపీడబ్ల్యూ స్కీం ఒకటి ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. – సీతంపేట



ఎగువబొండి గ్రామంలో నీటి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కళావతి



వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటు చేసిన సోలార్ రక్షిత మంచినీటి పథకం(నేడు)



వజ్జాయిగూడ గ్రామస్తులు గరిటె ద్వారా నీటిని తోడుతున్న దృశ్యాన్ని చూస్తున్న ఎమ్మెల్యే కళావతి (నాడు)



వజ్జాయిగూడలో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు(నేడు)



నాగులుగూడ పరిసరాల్లో మహిళలు పడుతున్న నీటి కష్టాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళావతి



నాగులుగూడలో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోపై ప్రజలకు విశ్వాసం

- వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంటు పరిశీలకుడు రవిబాబు



విలేకరులతో మాట్లాడుతున్న కుంభారవిబాబు, విక్రాంత్

పాలకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అంటే ప్రజలకు నమ్మకమని వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ విక్రాంత్‌లతో రాజకీయ పరిస్థితులపై సోమవారం సమాలోచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌మోహరెడ్డి ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టో విశ్వాసంతో కూడుకున్నదని తెలిపారు. ప్రజలకు చేయగలిగిన హామీలను మాత్రమే ఇస్తారని వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగడంతో పాటు ప్రతి కుటుంబానికి మేలు కలిగేలా మేనిఫెస్టోను ప్రకటించారని తెలిపారు. చంద్రబాబు అధికారం కోసం ఎన్ని హామీలు అయినా ఇవ్వడానికి వెనకాడడని విమర్శించారు. ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహనరెడ్డి కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల్లో వైఎస్సార్ పార్టీపై పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ నవరత్నాల పథకాలు కొనసాగాలంటే ఒక్క జగన్‌తోనే సాధ్యమని తెలిపారు. ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలకు అనుకూలమైన మేనిఫెస్టో సీఎం ప్రకటించారని తెలిపారు. ప్రచారంలో ప్రజలు పూర్తి మద్దతు అందిస్తున్నారని తెలిపారు.

భానుడు భగభగ



బోసి పోయిన సింగిడి కూడలి

భామిని: భానుడు భగభగమంటున్నాడు. ఉదయం ఏడు గంటలకే మండే ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకూ ఒకటే వేడి.. ఉక్కపోత. దీంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ఇళ్లల్లో ఉన్నవారు సైతం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండలకు రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. వ్యాపార కేంద్రాలు కొనుగోలుదారులు లేక బోసిపోతున్నాయి. సాయంత్రం ఐదు గంటల దాటితే తప్ప మార్కెట్‌కు ప్రజలు రావడం లేదు. ప్రముఖ వ్యాపార కేంద్రాలైన సింగిడి, బత్తిలి వంటి మార్కెట్లలో జనం లేక మధ్యాహ్నం దుకాణాలు మూసివేస్తున్నారు. దుకాణ యజమానులు సైతం ఎండలకు భయపడి ఇళ్లకే పరిమితమవుతున్నారు.